
# తెగింపు

రెంటాల హనుమత్ప్రసాద్




"నీలవేణి మొగుణ్ణి వదిలేసి ఇంకొకడితో ఉంటున్నదట" అని పర్వతరావు నాతో చెప్పాడు నెలరోజుల క్రితం. 'ఎంతకు తెగించింది నీలవేణి' ఈ నెల రోజుల నుండి నేను ఒక లక్షసార్లు ఈ మాట అనుకుని ఉంటాను. ఇదిగో అప్పటినుండి నీలవేణిని కలుద్దామనుకుంటే ఇప్పటికి పడింది. అదీ నాకు నేనుగా వెళ్ళి కలవలేదు. నీలవేణి ఈ రోజు ఒక రోడ్డు చివర్న ఎక్కణ్ణుంచో వస్తూ కలిసింది. 'నీలవేణీ' అన్నాను.

"ఏమిటోయ్ బుద్ధావతారం" అన్నది.

"అంటే నీవు ఈ నాలుగేళ్ళలో ఏమీ మారలేదన్నమాట."

"నీవూ మారలేదన్నమాట" నవ్వును బిగించింది పెదిమల మధ్య, కళ్ళను పెద్దవిగా చేసి చూస్తూ.

నిట్టూర్చాను. ఇప్పటి నీలవేణిలో ఠీవి పెరిగింది. అందం ఇనుమడించింది.

"నీతో మాట్లాడాలి" అన్నాను [illegible].

"నేనూ నీతో మాట్లాడాలి" నవ్వింది నీలవేణి.

"ఏ విషయం గురించి" ఆశ్చర్యపోతూ అడిగాను.

"నీవే విషయం గురించి?"

"ఉత్త మొండి జీవానివి" కోపంగా అన్నాను.

"నీవో పిరికి జీవానివి" తనూ అంతే కోపంగా అన్నది.

గాఢంగా ఒక నిట్టూర్చి "నీ గురించి తెలుసుకుందామని" అన్నాను. తనూ ఒక నిట్టూర్చింది. "నా గురించి నీతో చెప్పుకోవాలని."

"నీలవేణి! నేను విన్నది నిజమేనా" బాధగా అడిగాను.

"నిజమే" తల వంచుకుంది.

"విషయం ఏమిటి?"

"ఇప్పుడు కాదు. సాయంత్రం నెహ్రూ పార్కులో కూర్చుందాం, అప్పుడు చెబుతాను. ఇప్పటికే ఎండ పెరుగుతున్నది. ఆయన వచ్చే టైమ్ అవుతున్నది. సాయంత్రం కలుద్దాం." నవ్వేసి చకచకా వెళ్ళిపోయింది. ఆ నడకలో ఠీవి హుందాతనం చెక్కు చెదరలేదు.

[illegible] ఆరాధించేవాణ్ణి. మా ఇంటి ప్రక్కనే నీలవేణి వాళ్ళ ఇల్లు. నా చిన్నతనంలో నీలవేణికి పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళిపోయేదాకా చాలనే ఇష్టం. చిన్నప్పుడు ఒక జట్టుగా ఆడుకున్నవాళ్ళం. నీలవేణి నా కంటే ఒక ఏడాదిన్నర పెద్దది. నేను చిన్నప్పటి నుండి నీలవేణిని మనసు నిండా నింపుకుని ఉన్నాను. నీలవేణి మనసులో నేనూ ఉన్నానని నాకు తెలుసు. కానీ ఎవరికీ ఎప్పుడూ బయటపడే వాళ్ళంకాము. పైగా ఏమిటంటే మా ఇద్దరి మధ్య మరో ప్రేమ సంచరించేది. ఆ ప్రేమ మనసులో కాదు. మా బావ కూతురు ప్లస్ నా పెళ్ళాం. ముద్దుగా ముచ్చటగా ఉంటుందని ఇంట్లో వాళ్ళంతా కూడా పుతాణి చేసి నా పదిహేనవ సంవత్సరంలో దానికి అనగా నా పెళ్ళానికి ఐదో సంవత్సరం అప్పుడు ఒకటి చేసి అక్షింతలు చల్లారు. నీలవేణి నాదికాదు అనిపించేది నాకు. నేను దాని మొగుడే కాని తనవాడు కాలేదు అని నీలవేణికీ తెలుసు. కానీ ఒకరి మనసులో ఒకరం ఉన్నట్లు ఇద్దరికీ తెలుసు.

నీలవేణి మొదటి నుండీ విప్లవభావాలు గల స్త్రీ అని చెప్పడానికి కొన్ని ఉదాహరణలు ఉన్నాయి. మొదటిగా చెప్పాలంటే ఇంట్లో వాళ్ళు వద్దని వారించినా కాలేజీలో చేరిపోవడం ఒకటి. చేరినది పూరుకోకుండా మొగ వెధవలతో 'లగుడుపవ్వా' అన్నట్లు ఎలక్షన్లలో నిలబడి గెలవడం, బాయ్ ఫ్రెండ్స్‌తో కలిసి పినిమాలకు షికార్లకు కొట్టెయ్యడం, మీటింగులకు, పిక్నిక్‌లకు హాజరవడం, రాత్రిళ్ళు పినిమాలకు వెళ్ళి ఒంటరిగా రావడం, ఎవడైనా ఎదురుపడి ఏదైనా అంటే చెప్పుచ్చుకు కొట్టడం. . .ఇలాంటివెన్నో ఒకటనా రెండనా చెప్పేది. ఇలా చెబుతూ కూర్చుంటే రోజులు కూడా గడిచి పోతాయి.

ఒక చల్లని సాయంకాలం ఎవ్వరూ లేని సమయంలో మల్లె పూలు తలనిండా బరువుగా పెట్టుకుని నీలవేణి వచ్చింది. ఈజీచైర్‌లో డాబా మీద పడుకుని ఉన్న నన్ను వెనుకగా వచ్చి గట్టిగా పెదాల మీద ముద్దు పెట్టుకుంటూ అన్నది "ఒయ్ బుద్ధావతారం. నిన్ను నీ పెళ్ళాం కట్టేసుకుంది కాని లేకుంటే ఈ సరికల్లా నిన్ను లేపుకు వెళ్ళి రిజిస్టర్ మారేజి చేసుకుని వచ్చేదాన్ని. . .' అని.

నేను నవ్వి 'అలాగే. మరి ఆలస్యం దేనికి. నేను రెడీ' నీలవేణి కళ్ళల్లోకి చూస్తూ నవ్వాను.

అంతే. చటుక్కున దూరంగా జరిగింది నీలవేణి. ''నాకంత అదృష్టమా. ఈ జన్మకి నిన్ను అందుకో లేను.'' అంటూ గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

నీలవేణికి నా మీద బోల్డు నమ్మకం. ఒక్కోరోజు రాత్రిపూట నా గదిలోనే ఉండిపోయేది కబుకబుర్లాడుతూ. నన్ను గట్టిగా హత్తుకుని ఎన్నోసార్లు ముద్దులతో ముంచేసి "నేను దురదృష్టవంతురాలిని రాజా! లేకుంటే నా వాడివై పోయేవాడివి. ఆ రాక్షసి నీ పెళ్ళామై కూర్చుంది'' అని పార్వతి నుద్దేశించి పలికేది.

తరువాత నీలవేణికి పెళ్ళి జరిగిపోయింది బాంక్ ఎంప్లాయ్ అయిన మన్మథరావుతో. మన్మథరావు నిజంగా మన్మథుడే. మరి ఈ రోజు మన్మథరావులో ఏం లోపం చూసి అతగాడిని వదిలి వేసిందో నాకైతే తెలియదు సాయంత్రం నీలవేణి కలసి నాకు చెప్పేదాకా.

సాయంత్రం అయిదున్నర ప్రాంతంలో నెహ్రూ పార్కులోకి అడుగు పెట్టాను. అప్పటికే కొన్ని జంటలు చెట్ల క్రింద కూర్చుని ఉన్నాయి. కొంత మంది సిమెంటుతో చేసిన బెంచీల మీద కూర్చుని ఉన్నారు. నాకు కొద్ది దూరంలో ఒక నలుగుర వయసు మీరిన వాళ్ళు కూర్చుని బ్రాకెట్‌కాలెండర్ తెరచి రాత్రికి వచ్చే నెంబరు కోసం అన్వేషిస్తున్నారు. వారిలో ఒక ముసలాయన గబగబా నా దగ్గరకు వచ్చి అడిగాడు—"బాబూ నీ పేరేమిటయ్యా'' అని.

"రాజారావ్'' అని చెప్పాను.

"నీ పేరులో నాలుగు అక్షరాలు ఉన్నాయి. అయితే ఈ రోజు ఓపెనింగ్ నాలుగు వస్తుందన్న మాట'' అనుకుంటూ "ఓపెనింగ్ నాలుగు ఓపెనింగ్ నాలుగు'' అనుకుంటూ వెళ్ళాడు.

'వెధవ సెంటిమెంట్లు' అని నవ్వుకున్నాను.

పిల్లలు చెట్ల చాటున పరుగులు పెడుతున్నారు. ప్రకృతి పచ్చగడ్డి మీద చతికిలపడినట్లయ్యింది పార్కులోకి వస్తున్న నీలవేణి అందానికి.

దూరంగా సైకిల్ మీద వెళుతున్న కాలేజి స్టూడెంటు పార్కులోకి వస్తున్న నీలవేణిని చూసి పెద్దగా విజిల్ వేస్తూ రివ్వున వెళ్ళిపోయాడు

నన్ను చూసి నవ్వింది నా ప్రక్కన చతికిల బడుతూ.

"ఒక నాలుగు యుగాలు వెళ్ళి ఉంటాయి'' చిరుకోపంగా అన్నాను.

"అంటే నాలుగు నిముషాలు అన్నమాట''

చూశారండీ అదీ వరస. అదే నీలవేణిలోని ప్రత్యేకత. ఆ చమత్కారాన్ని ఎవరు మెచ్చుకోరు ఇలా మాట్లాడుతూ ఉంటుంది నీలవేణి.

"ఐస్‌క్రీమ్'' అరుచుకుంటూ బండిని నెట్టుకుంటూ వచ్చేడి ఒక మడ్డి కుర్రవాడు.

"రెండు ఐస్ కప్పులు ఇచ్చి వెళ్ళా'' అని ఒక రెండుకప్పులు అందుకున్నాను.

"చల్లగా ఉంటాయి'' కను బొమలు చిట్లించి చూస్తున్న నీలవేణిని చూసి ఏ మనాలో తెలియక ఆలా ఒవేసి పూరుకున్నాను.

"ఐస్ చల్లగా ఉంటుందన్న మాట'' తల గమ్మత్తుగా ఆడిస్తూ అన్నది.

చటుక్కున తల దించుకున్నాను.

"నీ వో ఫూల్‌వి రాజా''అన్నది చిరుకోపంగా నీలవేణి.

"ఒప్పుకుంటాను'' అన్నాను ఐస్ కొద్దిగా నోట్లోకి నెడుతూ.

"ఐతే నీ కీ జబ్బు పోలేదన్నమాట. చిన్నప్పటి నుండీ నీకు చల్లగాలి తగిలేత్తే ఉబ్బసం పుట్టుకు తగిలేత్తే ఉబ్బసం పుట్టుకు వచ్చేది. మా ఇంట్లో వావ్వనీకు సేవలు చేయులేక క్రిందా మీదా పడే వాళ్ళు. అప్పట్లో నీకెంత సీరియస్‌గా డాక్టర్ వార్నింగిచ్చాడు, ఐసులు తినొద్దని'' కోపంగా అన్నది లవేణి పొద్దికగా కూర్చుంటూ.

"నీలవేణి'' ఆర్ద్రంగా అన్నాను. నా మీద చిన్నప్పటి నుండీ ఇలా ఎన్నో జాగ్రత్తలు తీసుకునేది. చెప్పేది. నాకు ఐస్ అంటే చచ్చే ఇష్టం. ఎవరికీ తెలియకుండా తిందామని చూసేవాడిని. కుదురనిచ్చేది కాదు నీలవేణి. నీ ఆరోగ్యం నీవు లెక్క చెయ్యక పోయినా నాకు కావాలి అనేది.

నాలాంటి దురదృష్ట వంతుడు ఈ భూప్రపంచంలో మరొకడు ఉండడు నీలవేణి నాది కాకుండా పోయినందుకు. నా తప్పు కాదది. చిన్నతనంలోనే పార్వతికి నన్ను ఇచ్చి అంటగట్టిన ఇంట్లోవాళ్ళదీ తప్పు.


"నీలవేణి ఇప్పుడు చెప్పు. మన్మథరావుకు దూరంగా వచ్చేశావుట'' అన్నాను.

నవ్వింది నీలవేణి. "రాజా! ఎంత సున్నితంగా అడుగుతావు. దూరంగా వచ్చేశానని అడిగావు. పోనీలే సంతోషం. అందర్లా నీవు కూడా మొగుణ్ణి వదిలేశావుట కదా'' అని అడగనందుకు. ఎలా అయినా నాకు మెచ్చిన వాడివి కదా. ఇలాటి సుగుణాలు ఎన్ని లేనిది నీవు ఆకర్షించబడేవాడివి నా చేత. . .

నిజమే ఆ జంతువుని వదిలేశాను. వాడో నరరూప రాక్షసుడు. . .'' నా కళ్ళలోకి చూస్తూ అన్నది.

"నిజం రాజా! నేను అబద్ధాలాడాను. అది నీకు తెలుసు. వాడుత్త నీచుడు. పెళ్ళాన్ని అనుమానించే రాస్కెల్. వ్యక్తిత్వం లేని వెధవ. ఇంకా చెప్పాలంటే కుక్క, పంది. ఇక గుర్తుకు రావడం లేదు సమయానికి తిట్లు'' కోపాన్ని అదిమి పెట్టి బలవంతగా నవ్వింది. తరువాత రెండు మోకాళ్ళ మధ్య గడ్డం చేర్చి గడ్డి పరకలు పీకుతూ తలవంచుకుని అన్నది.

"అతను ఎలాంటి వాడో నీకు తెలియదు రాజా! ఎవరైనా ఇంటికి వచ్చారంటే నేను వంట గదిలో ముగ్గి పోవలసిందే వాళ్ళు వెళ్ళేదాకా. పొరపాటున అతను వచ్చే సరికి నేను వరండాలో నిలబడి ఉంటే చితకబాదేవాడు నన్ను. పక్కింటి ఆడవాళ్ళతో మాట్లాడ కూడదు. ఎక్కడికి వెళ్ళినా తల ఎత్తి చూడకూడదు. చూశానంటే ఆ రోజు నాకు మూడిందన్నమాట. అంత అనుమానం మనిషి. ఆ రాక్షసుడితోని వ్యక్తిత్వాన్ని చంపుకుని ఎదిరించకుండా ఎంతో సహనంతో నాలుగు సంవత్సరాలు కాపురం వెలగబెట్టాను. కానీ ఒక రోజు ఏం చేశాడో తెలుసా. మేముండే ఇంటి ప్రక్కనే ఉండేవాడు చిదంబరం. అతనూ, నా మొగుడు వెధవా రోజూ సాయంత్రం పూట కబుర్లాడుతూ గడిపేవాళ్ళు. వారిద్దరిది కొత్త సహవాసం. అంతకు మునుపు ఒకరినొకరు తెలియదు. ఒకరోజు ఇతగాడు ఇంటికి ఆలస్యంగా దిగబడ్డాడు. చెప్పడం మరిచాను. చిదంబరానికి నలభై సంవత్సరాలు ఉంటాయి.



నల్లగా ఎత్తుగా ఉంటాడు. అందగాడు కాదు. ఐనా అందం కొరుక్కు తిన్నా, తాళి కట్టిన వెధవకు అందం ఏడిసింది ఏం ప్రయోజనం మనసు అందంగా ఏడ్వనప్పుడు. చిదంబరం మనిషి అందగాడు కాక పోయినా మనసు వెన్నలాంటిది. . .సరే. నా మొగుడి వెధవ కోసం వచ్చిన చిదంబరంగారు ఆయన వచ్చే సమయం అవుతున్నది కదా ఈలోపు ఏమీ జరుగదులే అనుకుని ఉంటాడు పాపం. బయట వరండాలోని కుర్చీలో కూర్చుని ''కాసిని మంచి నీళ్ళు ఇవ్వ' మని అడిగాడు. ఇచ్చాను. [illegible]దే సమయానికి నా మొగుడు రాక్షసుడు వచ్చాడు. నా మనసు బాగో లేదు ఈ రోజు' అని చెప్పాడు చిదంబరంగారితో. చిదంబరం అటు వెళ్ళగానే నా వంక బుసలు కొడుతూ చూసి పండ్లు పటపట కొరికి బయటకు విసురుగా వెళ్ళిపోయాడు.




daCunha L/C/13 TL.

అట్నా వెళ్ళినవాడు ఇట్నా వచ్చేసి చేతిలో ఉన్న సీసాలోని ఆసిడ్‌ని నా ముఖం మీదకు విసిరాడు. తెలివిగా ప్రక్కకు తప్పుకున్నాను. అయినా అప్పటికే ఒక రెండు యాసిడ్ బొట్లు మెడ మీద కొద్దిగా భుజం మీద పడింది. ఇక అక్కడ ఉంటె ఆ రాక్షసుడు చంపేస్తాడేమో అనుకుని చిదంబరం రూమ్‌లోనికి పరుగు పెట్టాను. అతను నన్ను రక్షించాడు ఆ రాత్రి. తెల్లవారిన తర్వాత నేను వచ్చి వాడి కాళ్ళ మీద పడతాననుకుని ఉంటాడు ఆ రాస్కెల్. మరుసటి రోజు వచ్చాడు నా దగ్గరకు. నిష్కర్షగా చెప్పాను. నీకూ, నాకూ ఏ సంబంధం కాదని. ఎగిరి పడ్డాడు నా మాటలకు. పిచ్చిగా అరిచే వంటే నా మీద యాసిడ్ పోసినందుకు హత్యా ప్రయత్నం చెయ్యబోయాడని కోర్టుకు లాగుతాను అని బెదిరించాను. అంతే తోక జాడించాడు. చిదంబరం తనవల్లనే ఇదంతా జరిగిందని బాధ పడ్డాడు. నన్ను ఒప్పించాడు తనతో ఉండిపొమ్మని. ఇప్పుడు ఇద్దరం చక్కా కాపురం పెట్టాం. ప్రతి వెధవా నా గురించి ఎవడితోనో లేచి పోయిందని కూస్తున్నారు. . .ఆ మన్మథరావు వల్ల నాకు పిల్లలు పుట్టక పోవడం నాకు మేలే జరిగింది. నీవు చెప్పు రాజా. నాకు మాత్రం అందిరిలా చక్కగా సంసారం చెయ్యాలని ఉండదా. సుఖపడాలని ఉండదా. నా రాత అలా రాసి పెట్టి ఉంటే ఎవరు మాత్రం ఎం చెయ్యగలరు?. . .ఏనీవే ప్రస్తుతం సంతోషంగా ఉన్నాననుకో. చిదంబరం చాలా మంచివాడు. వెన్నలాంటి హృదయం అతనిది. ఈసారి మోస పోలేదని ధైర్యంగా చెప్పగలను'' కళ్ల వెంట నీళ్ళు తుడుచుకుంటూ అన్నది.

నీలవేణి చెప్పింది వింటే నా గుండె పిండినట్లు అయింది. అయినా నీలవేణి కళ్ళవెంట నీరు చూసే సరికి నీలవేణి కూడా ఏడుస్తుందా' అని ఆశ్చర్య పోయాను. ఎంత ధైర్యంగల ఆడదైనా ఆడదేగా. వారికిది సహజం అనుకుని గాఢంగా నిట్టూర్చాను.

''ఇప్పుడు చెప్పు రాజా! నా తప్పు ఉందని అనగలవా'' నా చేతులు పట్టుకుని నా కన్నుల్లోకి చూస్తూ అన్నది.

''నీలవేణి! నీవేం చేసినా నాకు న్యాయంగానే కనబడుతుంది. ఎందుకో తెలుసా. నీవేం చేసినా న్యాయంగా ఉంటుంది కాబట్టి, ఆలోచించి చేస్తావు కూడానూ'' అన్నాను నేను నీలవేణిని చూ స్తూ

నీలవేణి కన్నులు మెరిసినై. ''నాకు తెలుసు రాజా. నన్ను నీవు అర్థం చేసుకోగలవని.''

''రాజా! పార్వతి ఎలా ఉంది'' అడిగింది తను.

''ఒక బాబుని మాత్రం కని ఉంది'' నవ్వాను నేను.

''ఫూల్! ఆ విషయం నాకు తెలుసు. పార్వతి ఆరోగ్యం ఎలా ఉంది. . .ఏమంటున్నది. ఇద్దరూ చక్కగా సఖ్యతగా ఉంటున్నారా. . .మీరు ఎప్పుడు సుఖంగా ఉండాలని ఆ భగవతుణ్ని ఎన్నోసార్లు కోరుకుంటూ ఉంటాను.''

నా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. నీలవేణి ప్రశ్నకు ఏం చెప్పాలో జవాబు తోచలా. 'నే నో ఫూల్‌ని'' అనుకుంటూ ''పిచ్చి నీలూ! నా పెళ్ళాం నన్ను బాగా చూసుకోవడమేమిటి. ఎవరైనా సహజంగా ఆడవాళ్ళని ప్రశ్నిస్తారు—మీ ఆయన ఎలా చూసుకుంటున్నాడు నిన్ను అని. నీవేమో మరి. . .'' నవ్వాను.

చిలిపిగా నవ్వుతూ అన్నది. ''లింగ భేదం తప్పితే నిన్ను అడగవలసిన ప్రశ్నేలే ఇది.''

''చావు దెబ్బ కొట్టావ్'' అంటూ నవ్వి నీలవేణి నెత్తి మీద చిరుకోపంతో ఒక మొట్టు మొట్టాను.

''రాజా! చీకటి పడుతున్నది. చిదంబరం ఈపరికి ఇంటికి వచ్చి ఉంటాడు. నా కోసం వెయిట్ చేస్తుంటాడు పాపం. నీవోసారి మా ఇంటికి రావాలి. ఆయన్ని పరిచయం చేస్తాను. తరచుగా మనం కలుస్తు ఉండొచ్చు. మా అడ్రస్ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ప్రక్క రోడ్‌లోని మొదటి ఇల్లు. గుర్తుంచుకో తప్పక రావాలి'' లేస్తూ అన్నది.

''అలానే'' అన్నాను.

''మరి ఉంటాను రాజా'' నా వంక ఒక మారు ఆరాధనగా చూసి సెలవు తీసుకుంది. మరో మారు చెప్పింది వెళ్తూ మా ఇంటికోసారి రమ్మని.

తోవలో నడుస్తూ అనుకున్నాను. నీలవేణి ఆడదైనా మొగుడు రాచి రంపాన పెడుతుంటే తెగింపుతో విడిపోయి మరో సంసారం ఏర్పరుచు కుంది. ఈ రోజు నా భార్య పార్వతి నా మీద చీటికీ మాటికీ అనుమానం పెంచుకుని నాకు నరకాన్ని చూపిస్తుంటే కనీసం సన్యాసుల్లో కలవడానికి కూడా తెగింపు లేకపోయింది. పిరికి వాడిని. మరి నీలవేణి తెగింపుకల 'ఆడది' అనుకుని భారంగా నిట్టూర్చి ఇంటి దోవ పట్టాను. *